

హైదరాబాద్ వార్త

## దూలపల్లిలో కమిషనర్ సృజన క్షేత్రస్థాయి పర్యటన

**కాలనీల సంక్షేమ సంఘాలతో ప్రత్యేక మీటింగ్**

**హైదరాబాద్, మే 4,ప్రభాతవార్త:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సృజన సోమవారం కుత్బుల్లాపూర్ జోన్ కొంపల్లి సర్కిల్ దూలపల్లి వార్డులో క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా స్థానిక పౌరులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో మాట్లాడి పారిశుధ్యం, ఇంజనీరింగ్ పనులు మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలపై సమీక్షించారు. ఈసందర్భంగా దూలపల్లి ట్రాన్స్ ఫర్ స్టేషన్ వద్ద అక్రమంగా చెత్తను తగలబెడుతున్నారని, దీనివల్ల కాలుష్యం పెరుగుతోందని నివాసితులు ఫిర్యాదు చేశారు. స్వచ్ఛ ఆటోల క్రమబద్ధమైన రాకను నిర్ధారించాలని కోరారు. దూలపల్లి శ్మశానవాటిక నిర్వహణ, వాచ్‌మెన్ నియామకం సేవా రుసుముల ఖరారుపై ఉన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తెచ్చారు. అలాగే మహాలక్ష్మి కాలనీలో కొత్త సీవరేజ్ లైన్ల అవసరం, యుజిడి పనులలో లోపాలు డ్రైనేజీ లీకేజీల సమస్యలను నివాసితులు వివరించారు. మైసమ్మగూడలో గుంతలమయమైన రోడ్లు ,వీధి దీపాల కొరతపై ఆందోళన వ్యక్తం చేశారు. లింగయ్య చెరువు కలుషితం కాకుండా నిరోధించడానికి మల్లారెడ్డి విద్యాసంస్థల వద్ద ఎస్టీపీ ఏర్పాటు ప్రతిపాదనను చర్చించారు.



కాలనీవాసులతో సమావేశమైన సిఎంసి కమిషనర్ జి.సృజన

దూలపల్లి-షాపుర్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి రోడ్డు వెడల్పు చేయాలని, వీధి కుక్కల బెడదను అరికట్టాలని కోరారు. మహాలక్ష్మి కాలనీలోని పార్క్ భూమిని సంరక్షించి అభివృద్ధి చేయాలని, అలాగే ఎస్సీ శ్మశాన వాటికలో గది బోర్వెల్ సౌకర్యాలు కల్పించాలని కమిషనర్‌కు విన్నవించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేరుగా పౌరులతో మాట్లాడి సమస్యలను తెలుసుకోవడం, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తనిఖీ చేయడం ద్వారా ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. ప్రతి వార్డులో పౌర సేవలను మెరుగుపరచడానికి కార్పొరేషన్ కట్టుబడి ఉందని రాబోయే వార్డు సందర్శనల్లో పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోవాలని కోరారు.

# నగరానికి 'నీటి గండం'




**-అడుగంటి పోతున్న భూగర్భ జలాలు**
**-ఎండిపోతున్న బోర్లు**
**..లోప్రెషర్‌తో నల్లా నీళ్లు**
**-రోజుకు 11వేలకు పైగా వాటర్ ట్యాంకర్ల బుకింగ్**
**-నీటిని పొదుపుగా వాడుకోవాలంటున్న జలమండలి**
**-వృథా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**హైదరాబాద్, మే 4,ప్రభాతవార్త:**
వేసవి వచ్చిందంటే చాలు నగరవాసులను నీటి కష్టాలు వెంటాడుతాయి. భూగర్భ జలాలు అడుగంటి పోతుండటంతో ప్రతి ఏడాది ఇదే పరిస్థితి నెలకొంటుంది. అయితే ఈసారి కూడా సమ్మర్ లో నీటి కష్టాలు తప్పేలా లేవు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అత్యధిక ప్రాంతాల్లో గతేడాదికంటే భూగర్భ జలాలు గణనీయంగా తగ్గాయి. లాస్ట్ ఇయర్‌తో పోలిస్తే ఈసారి నగరంలో ఎక్కువగానే వర్షపాతం నమోదయ్యింది.. దీంతో ఈఏడాది భూగర్భ జలాలకు ఇబ్బంది లేదని అనుకుంటున్నారు అయినప్పటికీ గతేడాదికంటే వేగంగా ఈసారి గ్రౌండ్ వాటర్ లెవెల్స్ పడిపోయాయి. ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ, మాదాపూర్, శేరిలింగంపల్లి లాంటి ఏరియాల్లో భవన నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఎక్కడా ఖాళీ జాగా ఉండట్లేదు.. వర్షం పడ్డప్పుడు ఆ నీళ్లంతా భూమిలోకి వెళ్తే భూగర్భ జలాలు పెరుగుతాయి.. కానీ ఈ ఏరియాల్లో ఎక్కడా ఖాళీ భూమి ఉండట్లేదు.. ఉంటే భవనాలు లేకుంటే రోడ్లు ఉంటున్నాయి.. ఇక ఇంటి పక్కనో, ఇంటి ముందో ఉన్న ఖాళీ జాగాలో కూడా టైల్స్ వేయించడం, లేదా సిమెంట్ తో ఫ్లాట్ గా చేస్తున్నారు.. దీంతో వర్షం పడ్డప్పుడు ఆ నీళ్లు భూమిలోకి ఇంకకుండా డ్రైనేజ్ లో కలిసి పోతున్నాయి. ప్రధానంగా బంజరాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ లాంటి ఏరియాలు ఎత్తులో ఉండటంతో వర్షంపడ్డపుడు నీరు భూమిలో ఇంకకుండ కిందికి వెవెళ్ళిపోతుందని అధికారులు తెలుపుతున్నారు.

### అధికంగా ఆఏరియాల్లోనే..

అధికారులు చేసిన సర్వే ప్రకారం హైటెక్ సిటీ నుంచి బంజారాహిల్స్ వరకు భూగర్భజలాలు దారుణంగా పడిపోయాయి.. ఐకియా చుట్టూ 5 కిలోమీటర్ల పరిధిలో ఒక్క చుక్క నీరు కూడా భూమిలో ఇంకే పరిస్థితి లేదు. అభివృద్ధి పేరుతో సిటీలో సిమెంట్ ట్యాపింగ్ రోడ్లు ఎక్కువగా పెరిగిపోతున్నాయి.. దీంతో రోడ్లపై నీరు భూమిలో ఇంకడం లేదు.. సిమెంట్ టాపింగ్స్ తో పాటు నీటి సమస్యకు మరో కారణం హై రైజ్ భవనాలు. వంద గజాల స్థలంలో5 నుంచి 8 అంతస్తుల భవనాలు నిర్మించి, ఒక్కో భవనంలో 50 మంది నివసిస్తున్నారు. ఈ భవనాల్లో నీటి వినియోగం అమాంతంగా పెరిగింది. కానీ భూగర్భ జలాలను రీఛార్జ్ చేసే వ్యవస్థలు లేకపోవడంతో సమస్య మరింత పెరిగిపోతుంది.

### ఇంకుడుగు గుంతలు ఏర్పాటు చేయాలి..

వర్షపు నీళ్ల భూమిలో ఇంకాలంటే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నారు జలమండలి అధికారులు. 300 గజాల కన్నా ఎక్కువ ఉన్న ప్రతీ భవనానికి ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని నిబంధన పెడుతున్నారు.. కానీ నగరవాసులెవరూ ఈ నిబంధన పాటించట్లేదు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోకుంటే కొత్త నీటి కనెక్షన్స్, డ్రైనేజ్ కనెక్షన్స్ ఇవ్వమని చెబుతున్నారు. ఇక నుంచి నీటి గుంతలు లేకుంటే ఫైన్స్ కూడా వేస్తామని గ్రౌండ్ వాటర్ పెరగాలంటే తప్పకుండా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాల్సిందే అని చెబుతున్నారు.. ఇంకుడు గుంతల ఏర్పాటు పై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని వారు పేర్కొంటున్నారు.

### ప్రతిరోజు 11వేల ట్యాంకర్లు బుకింగ్..

"భూగర్భ జలాలు పడిపోతుండటంతో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతిరోజు 11 వేల టాంకర్లను నగరవాసులు బుక్ చేసుకుంటున్నారు.గ్రేటర్ పరిధిలో వాటర్ ట్యాంకులను సప్లై చేయడానికి మొత్తం 90 వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లో ఉన్నాయి. ఇవి మూడు షిఫ్టుల్లో వాటర్ సప్లై చేస్తున్నాయి. 2021 జనవరిలో సుమారు 52 వేల ట్యాంకర్లు సరఫరా చేయగా, 2026 నాటికి అది లక్షా ఎనిమిది వేల వరకు పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. మార్చి నెలలో అయితే ఈ డిమాండ్ మూడు రెట్లు పెరిగినట్లు వివరించారు. అయితే, ఈ సంవత్సరం మొత్తం పరిస్థితి గత సంవత్సరంతో పోలిస్తే నియంత్రణలోనే ఉందని తెలిపారు. నగరంలోని 80 శాతం ప్రాంతాల్లో ట్యాంకర్ల అవసరం లేకుండా సరఫరా సజావుగా జరుగుతుండగా, కేవలం 20 శాతం ప్రాంతాల్లో మాత్రమే అధిక డిమాండ్ ఉందని చెప్పారు. ముఖ్యంగా ఎస్ఆర్‌నగర్, జూబ్లీ హిల్స్, మాధాపూర్, గచ్చిబౌలి, కూకట్ పల్లి వంటి ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గడం, హై రైజ్ భవనాలు పెరగడం వల్ల ట్యాంకర్లపై ఆధారపడుతున్నాయన్నారు. ప్రస్తుతం నగరంలో రోజుకు సుమారు 11 వేల ట్యాంకర్లు బుక్ అవుతున్నాయని, అందులో 80 నుండి 90 శాతం డిమాండ్ కొద్ది ప్రాంతాల్లోనే కేంద్రీకృతమైందని తెలిపారు. మొత్తం 14 లక్షల కనెక్షన్లు ఉన్నప్పటికీ, కేవలం 48 వేల మంది మాత్రమే ట్యాంకర్ సేవలను వినియోగిస్తున్నారని, అందులోనూ కొద్దిమంది ఎక్కువగా ట్యాంకర్లు బుక్ చేస్తున్నారని వెల్లడించారు. ప్రధానంగా భూగర్భ జలాల తగ్గుదల కారణంగా సమస్యలు వస్తున్నాయని ఈ పరిస్థితిని ఎదు ర్కొనేందుకు ట్యాంకర్ల ద్వారా సరఫరా, ఫిల్లింగ్ స్టేషన్ల ఏర్పాటు, ట్రాన్స్ మిషన్ మానిటరింగ్ వంటి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా**



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

**హైదరాబాద్, మే 4,ప్రభాతవార్త:**
ప్రజా సమస్యలపై అందిన దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని, పిడి హౌసింగ్ అశోక్ చక్రవర్తి , ఇంచార్జ్ డిఆర్ఓ శ్రీధర్ లతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి ప్రజలు అందించిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతిస్తూ అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే మండల డివిజన్ స్థాయిలలో ఉన్నటువంటి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై ఆమె సమీక్షించి పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని అలాగే పెండింగ్ దరఖాస్తులకు సత్వరమే ఏటీఆర్ ద్వారా రిమార్కులు తెలపాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి ప్రతి సోమవారం హైదరాబాద్ సికింద్రాబాద్ డివిజన్ లలో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రజల దరఖాస్తులను స్వీకరించి సత్వరమే పరిష్కరించే దిశగా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల 10 వ తరగతి ఫలితాలలో 600/596 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించిన న్యూజన్ పాఠశాల విద్యార్థి నాగ దాసరి ధీయా సాత్విక్‌ను కలెక్టర్ సన్మానించి అభినందించారు. ప్రజావాణిలో మొత్తం దరఖాస్తులు 478అందాయని అందులో హౌసింగ్ శాఖ కు సంబంధించి 377అర్జీలు, పింఛన్లు 62, రెవిన్యూ శాఖ 13, అలాగే ఇతర శాఖలు 26 అందాయని తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఓ డాక్టర్ సురేందర్, జిఎం పరిశ్రమలు పవన్ కుమార్, డి సి హెచ్ ఓ డాక్టర్ సూర్య కళ, సంక్షేమ అధికారులు జి ఆశన్న, కోటాజి, ప్రవీణ్ కుమార్, ఇలియాస్ అహ్మద్, ఏవో విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్‌లో 'తెలిదేవర భానుమూర్తి 'సంతాప సభ

**-నివాళులు అర్పించిన సీనియర్ జర్నలిస్టులు**



భానుమూర్తి సంతాపసభకు హాజరైన సహచర జర్నలిస్టులు

**హైదరాబాద్, మే 4,ప్రభాతవార్త:**
ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్ట్ తెలిదేవర భానుమూర్తి సంతాపసభ జరిగింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఈకార్యక్రమంలో ఉదయం పత్రికలో ఆయనతో కలిసి పనిచేసిన మిత్రులు, తోటిజర్నలిస్టులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా భానుమూర్తి సేవలు, ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. భానుమూర్తి తెలంగాణ మాండలిక శోభను అక్షరాల్లో నింపి ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రత్యేక పాత్ర పోషించారని..ఆయన మాటలో,నవ్వులో, నడవడికలో తెలంగాణ స్ఫూర్తి కనిపించేదని సహచరులు పేర్కొన్నారు. కాగా భానుమూర్తి 1953 జనవరి 16న భువనగిరిలో జన్మించి యాదగిరిగుట్ట, ఆర్మూర్‌లో చదువుకొని, ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తిచేశారని 1969లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని వారు పేర్కొన్నారు.

## భోలక్‌పూర్ అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం

**ముషీరాబాద్, మే 4, ప్రభాతవార్త:**
భోలక్‌పూర్ అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల స్పష్టం చేశారు. సోమవారం ఆమె స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ



భోలక్‌పూర్ అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్

అనిల్‌కుమార్ యాదవ్‌లతో కలసి అగ్నిప్రమాద ప్రాంతాన్ని సందర్శించారు. ఆదివారం రాత్రి 11గంటల ప్రాంతంలో ముషీరాబాద్ నియోజకవర్గం భోలక్‌పూర్‌లోని ఒక షాపులో అగ్ని ప్రమాదం సంభవించి, కొద్ది సమయంలోనే ఆరు షాపులకు మంటలు వ్యాపించటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యి, బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ముషీరాబాద్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ప్లాసిక్, స్క్రాప్, సిలెండర్లు వంటి వాటికి మంటలు అంటుకోవటంతో దాదాపు 10 ఫైర్ ఇంజన్లతో, మూడు, నాలుగు గంటలు శ్రమించి, మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. స్థానికులు సకాలంలో స్పందించటంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు కానీ, సుమారు 8 కుటుంబాలకు అగ్నిప్రమాదం వల్ల ఆస్థినష్టం సంభవించింది. కలెక్టర్‌తో కలసి ఎంపీ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రమాద తీవ్రతపై ఆరా తీశారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆస్తి నష్టాన్ని అంచనా వేసి, బాధితులకు తక్షణమే సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, మాజీ కార్పోరేటర్ వాజిద్‌హుస్సేన్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు షరీఫ్, యూత్ కాంగ్రెస్ నగర నాయకులు సంగపాక వెంకట్ తదితరులు పరామర్శించారు. ప్రమాదం ఎందువల్ల జరిగింది అనే దానిపై ఇంకా స్పష్టత రావల్సి ఉంది.

## సహాజీవనం చేస్తున్న ప్రియుడి హత్య..

**కుత్బుల్లాపూర్, మే 4 ప్రభాతవార్త**
తన కుమారుడితో పరాయివ్యక్తితో సహాజీనం చేస్తున్న ఓ మహిళ తన ప్రియుడ్ని దారుణంగా హత్యచేసి పోలీసులకు చిక్కిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని తీవ్ర కలకలం సృష్టించింది. అర్ధరాత్రి శవాన్ని తరలిస్తున్న వీరిపై బస్తీని నిఘాకాస్తున్న పోలీసులకు అనుమానంవచ్చి విచారించగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చింతల్ చెరుకుపల్లి కాలనీలో కేరళ రాష్ట్రానికి చెందిన హోటల్ యజమాని కృష్ణకు చెందిన ఇంట్లో ఆరుణ అతని కుమారుడు సాయిరత్నంలు అద్దెకు వుంటూ కూలీపనిచేసుకుంటూ జీవిస్తున్నారు. పదినెలలక్రితం శివారెడ్డి అనేవ్యక్తితో ఆరుణకు పరిచయం కావడం అదికాస్తా స్నేహంగా మారి ముగ్గురు ఒకేగదిని తీసుకుని జీవిస్తున్నారు. వీరిమధ్య తరచూ ఘర్షనలు చోటుచేసుకుంటూ తల్లీకొడుకులను శివారెడ్డి అవమానించేవాడు. మధ్యానికి బానిసైన శివారెడ్డి వేధింపులు అధికం కావడంతో పాటు ఆదివారం రాత్రి మధ్యంమత్తులో ఆరుణతో ఘర్షనకు దిగాడు. దీనితో శివారెడ్డిని తాను అంతకుముందే తెచ్చిన కత్తితో గొంతు కోసి హాత్యచేసింది. అనంతరం తల్లి ఆరుణ, కుమారుడు సాయి రత్నంలు గోనెసంచిలో శవాన్ని కుక్కి పడేయడానికి రోడ్డుపైకి తీసుకువచ్చారు. ఇదేయమంలో గస్తీకాస్తున్న పోలీసులకు వీరిపై అనుమానంవచ్చి సంచీ తెరచి చూపించమని ఆడిగి తనికీచేయడంలో అందులో పోలీసులకు మృతదేహం కనిపించింది. వెంటనే వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా శివారెడ్డిని తామేహత్య చేసి రోడ్డుపై పడేసేందుకు తరలిస్తున్నట్లు అంగీకరించారు. హాత్యచేసిన ఆరుణది సంగారెడ్డిజిల్లా సంగారెడ్డి గ్రామంగా గుర్తించగా హాత్యకు గురైన శివారెడ్డిది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్యజిల్లా గల్లెరేడు గ్రామంగా గుర్తించారు. కుటుంబ వివరాలు తమకు తెలియవని కేవలం పదినెలలక్రితం పరిచయం అయినట్లు వారు తెలిపారు. ఈమేరకు జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదుచేసుకుని విచారిస్తున్నారు.

## శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

**-కమిషనర్ చాంబర్ దగ్ధం**

**శేరిలింగంపల్లి,మే 4 ప్రభాతవార్త**
శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం సంబవించింది. సైబరాబాద్ మునిసిఫల్ కార్పొరేషన్ పరిధిలోని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రమాదవశాత్తు మంటలంటుకుని జోనల్ కమిషనర్ చాంబర్‌లోని పర్నిచర్ దగ్ధమయ్యింది. జోనల్ కార్యాలయంల వెనుక వైపు ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పడిన స్పార్క్‌తో అక్కడే ఉన్న చెట్టకు మంటలు అంటుకుని, విద్యుత్ తీగల గుండా జోనల్ కార్యాలయంలోనికి మంటలు వ్యాపించినట్లు సీఎంసీ సిబ్బంది తెలిపారు. ఈ అగ్నిప్రమాదం తో ఏలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. అస్తినష్టం ఎంతమేరకు ఉంటుందనే ఆంశంపై అంచనా వేస్తున్నారు.

## ప్రధాని మోడీ సభను విజయవంతం చేయాలి : బిజెపి

**కంటోన్మెంట్,మే 4 ప్రభాతవార్త:**
ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో తలపెట్టనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయంతం చేసేందుకు బిజెపి కార్యకర్తలు,నాయకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావ్ తెలిపారు. సోమవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ సభా స్థలం వద్ద ఏర్పాటు చేసిన భూమి పూజకు ఎంపీలు ఈటెల రాజేందర్,డాక్టర్ లక్ష్మణ్‌లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు 2 లక్షల మందికిపైగా బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పార్టీ నాయకులు జిల్లాల వారిగా పర్యటిస్తూ సభకు బారీ సంఖ్యలో తరలి వచ్చేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్,రాజ్య సభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్‌లు మాట్లాడుతూ ప్రధాన నరేంద్ర మోదీ 3వ సారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొట్ట మొదటి సారిగా తెలంగాణకు విచ్చేస్తున్నారన్నారు. ఈ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు,నాయకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. అదే విధంగా అస్సాం, బెంగాళ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి బారీ మోజార్టీతో విజయం సాధించిందన్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనపై ప్రజలు విరక్తి చెందారని,రాష్ట్రంలో కూడా బిజెపి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్, బిజెపి నాయకులు మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, మాజీ కార్పోరేటర్ కొంతం దీపిక, మహంకాలి జిల్లా ఉపాధ్యక్షులు డి.ఎన్.శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మీడియాతో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావ్, ఎంపీలు ఈటెల రాజేందర్,లక్ష్మణ్ తదితరులు

# ప్రభుత్వ భూములు కాపాడండి

## హైడ్రా ప్రజావాణికి 56 ఫిర్యాదులు

**హైదరాబాద్, మే 4,ప్రభాతవార్త:**
ప్రభుత్వ భూములు కాపాడాలంటూ హైడ్రా ప్రజావాణికి విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమికి సంబంధించి గజం స్థలం కబ్జా అవుతున్నా నగర ప్రజలు ఊరుకోడంలేదు. గతంలో మనకెందుకులే అనుకునేవాళ్లమని.. ఇప్పుడు హైడ్రాకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటారనే నమ్మకంతో తామంతా వచ్చి ఫిర్యాదు చేస్తున్నామని పలువురు సోమవారం హైడ్రా ప్రజావాణిలో తెలిపారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో హైడ్రా చూపుతున్న చొరవను చూసి తాము ఫిర్యాదు చేస్తున్నామన్నారు. కబ్జాదారులు ఎంతటి వారైనా వదిలిపెట్టకుండా ఆక్రమణలు తొలగించడాన్ని అభినందిస్తూనే మా ప్రాంతాల్లో కూడా చెరువులు, ప్రభుత్వ భూములు, పార్కులు, నాలాల ఆక్రమణలకు గురౌతున్నాయని.. వాటిని కాపాడాలని పలువురు హైడ్రాను విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లి విలేజ్‌లోని 100 అడుగుల రహదారికి ఆనుకుని రెండు రోడ్డులు కలిసే చోట ఉన్న ప్రభుత్వ భూమిలో రేకుల ప్రహరీ వేసి లోపల నిర్మాణాలు చేపడుతున్నారని అక్కడి స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని ఐడీపీఎల్ కాలనీ నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే మార్గంలో నాలాలపై నిర్మాణాలు చేపడుతున్నారని.. వర్షాకాలం వరద ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకుండా వెంటనే ఆపాలని ప్రజావాణిలో కోరారు. కీసర మండలంలోని నాగారం విలేజ్‌లో సర్వే నంబరు 291/3లఓ మొత్తం 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఉప్పల్ మండలంలోని మల్లాపూర్ గ్రామం సర్వే నంబరు 84లో దాదాపు 2 వేల గజాల స్థలం ప్రభుత్వానిది కాగా.. ఇందులో నిర్మాణాలకు సిద్ధమౌతున్నారని వెంటనే కాపాడాలని కోరారు. కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఆలయాల పేరిట వ్యాపార సముదాయాలు నిర్మించి అద్దెలు ఇచ్చి రూ. లక్షలు కాజేస్తున్నారని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కీసర మండలం నాగారం విలేజ్‌లోని సర్వే నంబరు 83లో 18 ఎకరాల మేర ఉన్న పాత లేఔట్‌ను చెరిపేసి 80 గజాల చొప్పున నోటరీమీద స్థలాలు అమ్ముకుంటున్నారని.. పాత లే ఔట్ ప్రకారం పార్కులు, రహదారులు కాపాడాలని ప్లాట్ల యజమానులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం బడంగిపేట గ్రామంలో మల్లప్పగారి కుంట దాదాపు 14 ఎకరాలుంటుందని.. మొత్తం చెరువు స్వరూపాన్ని మార్చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఫిర్యాదులో స్థానికులు పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేటలోని కుంట్లూరు విలేజ్లో ప్రజయ్ గుల్‌మహర్ కాలనీ గేటెడ్ కమ్యూనిటీ కాకపోయినా రహదారులకు అడ్డంగా ప్రహరీలు నిర్మించి పక్కనే ఉన్న కాలనీలకు దారి లేకుండా చేస్తున్నారని అక్కడి స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 56 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

**-తొర్రూరు మాజీ సర్పంచ్ మేకం లక్ష్మి**



**తుర్కయంజాల్ మే 4( ప్రభాతవార్త)**

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, తొర్రూరు మాజీ సర్పంచ్ మేకం లక్ష్మి అన్నారు. ఆదిభట్ల సర్కిల్ తొర్రూరులో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకం లక్ష్మి, మాజీ కౌన్సిలర్ నక్క శివలింగం గౌడ్ లు మాట్లాడుతూ 2006 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తొర్రూరు రెవెన్యూ సర్వేనెంబర్ 383లో 530 మంది నిరుపేద ప్రజలకు 60 గజాల చొప్పున ప్లాట్లు అందజేయడం జరిగిందని, అప్పటి గ్రామ పంచాయతీ రికార్డులలో, శిలా పలకాలపై రాసి ఉన్నాయని తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుండి అభివృద్ధి చేయిస్తానని అన్నారు. పేద ప్రజలకు న్యాయం చేసేంతవరకు ప్రతి ఒక్కరికి ఇండ్లు లేని నిరుపేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని వారు మాట ఇచ్చారు. ఎమ్మెల్యే పేరు ఆరోపణ చేసే ముందు ఎక్కడ భూములు ఆక్రమణలకు గురి అయ్యాయో నిరూపించాలని, తన స్థాయిని మరిచి ఎలాంటి అవగాహన లేకుండా స్థానిక ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగారెడ్డి పై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని, అడ్డగోలుగా నోరు పారేసుకుంటే భవిష్యత్తులో ప్రజలే అభివృద్ధి చెపుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తొర్రూర్ రంగనాయకుల స్వామి దేవాలయం చైర్మన్ అనిల్ రెడ్డి, సమ్ రెడ్డి వెంకట్ రెడ్డి, వంగేటి మహిపాల్ రెడ్డి, వేముల మోహన్ రెడ్డి, మేకం శ్రీశైలం, మేకం ఎల్లయ్య, దప్పు శ్రీను, వరకాల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

**:బిజెపి భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి నవీన్ పటాలే**



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి నవీన్ పటాలే తదితరులు

**మలక్ పేట, మే 4, ప్రభాతవార్త:**

ఈనెల 10వ తేదీన నగరంలోని పేరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి నవీన్ పటాలే పేర్కొన్నారు. ఆస్మాన్ ఘాడ్ డివిజన్ డివిజన్ ఏపీఎయు కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ హాజరవుతున్న బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, హిందూ బంధువులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. రెండున్నర సంవత్సరాల తర్వాత దేశ ప్రధాని మోడీ నగరానికి విచ్చేయనున్నట్లు తెలిపారు. దేశ ప్రధాని మోడీ సారథ్యంలో దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. దేశ ప్రజల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమాజానికి తమ వంతు సేవలు: కట్ట మల్లేశం



ప్రజలకు చల్లని మజ్జిగ, అంబలిని పంపిణీ చేస్తున్న కట్ట మల్లేశం, అనిల్ గౌడ్ తదితరులు

**మలక్ పేట, మే 4, ప్రభాతవార్త:**

సమాజానికి తమ వంతు సేవలు అందించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ ప్రముఖ వ్యాపారవేత్త కట్ట మల్లేశం పేర్కొన్నారు. వేసవి కాలాన్ని పురస్కరించుకొని ప్రజలకు దాహార్తిని తీర్చడం కోసం నిర్వాహకులు అనిల్ గౌడ్ తో కలిసి కట్టా మల్లేశం చల్లని మజ్జిగ, అంబలిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండే ఎండల్లో ప్రజల సౌక ర్యార్థం 41 రోజులపాటు చల్లని మజ్జిగ అంబలి తదితర వాటిని ప్రజలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## క్రీడలతో చక్కటి ఆరోగ్యం: ఎమ్మెల్యే అహ్మద్ బలాల



నూతన క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల చిత్రంలో అబ్రర్, స్పోర్ట్స్ ఇన్ స్పెక్టర్ రవూఫ్ అలీ తదితరులు

**మలక్ పేట, మే 4, ప్రభాతవార్త:**

క్రీడలతో చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్ పేట నియోజకవర్గం అజంపుర డివిజన్ లో సుమారు 31.95 లక్షలతో నూతనంగా నిర్మించిన క్రీడా ప్రాంగణాన్ని ఎమ్మెల్యే అహ్మద్ బలాల ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలల మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. క్రీడ ప్రాంగణంలో వాలీబాల్, బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్, తదితర ఆటలు ఆడుకోవడం కోసం ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. చిన్నారులు, యువతకు క్రీడల పై ఆసక్తి పెంపొందించుకోవడానికి ఇటువంటి క్రీడా ప్రాంగణాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. త్వరలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో మరిన్ని నూతన క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ వేణుగోపాల్, స్పోర్ట్స్ ఎఇ సజ్జాద్, స్పోర్ట్స్ ఇన్ స్పెక్టర్ రవూఫ్ అలీ, అజంపుర డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు అబ్రార్, నాయకులు అలీం కైసర్ , అనాస్ పాల్గొన్నారు.

**బిజెపి గెలుపుతో అక్రమ చొరబాటుదారులకు అడ్డుకట్ట : టింగ్లికార్ రాజేష్**

**సైదాబాద్, మే 2 ప్రభాతవార్త:** పశ్చిమ బెంగాల్లో భారతీయ జనతా పార్టీ గెలుపుతో ఆ రాష్ట్రంలోకి అక్రమ చొరబాటు దారులకు అడ్డుకట్ట పడనుందని చంపాపేట డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు టింగ్లికార్ రాజేష్ అన్నారు. ప్రధాని నరేంద్రమోడి నాయకత్వానికి దేశ ప్రజలంతా సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలు మరోసారి ఋజువు చేశాయని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో గెలుపు పరంపర కొనసాగుతుందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణాలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

## ప్రధాని బహిరంగ సభను విజయవంతం చేయండి : లింగాల హరిగౌడ్



బహిరంగ సభకు తరలిరావాలని వాకర్స్ ను కోరుతున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి, లింగాల హరిగౌడ్, మంజుల రెడ్డి

**సైదాబాద్, మే 4 ప్రభాతవార్త:** ఈ నెల 10వ తేది ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడి ముఖ్య అతిథిగా హాజరుకానున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు లింగాల హరిగౌడ్ కోరారు. ఆస్మాన్‌ఘడ్ డివిజన్‌లోని రెవిన్యూబోర్డు కాలనీ, ఏపిఏయు కాలనీ, ఎస్‌బిహెచ్ కాలనీ పార్కుల్లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులారెడ్డితో కలిసి వాకర్స్‌కు కరపత్రాలను పంపిణీ చేస్తూ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహించారు. అనంతరం లింగాల హరిగౌడ్ మాట్లాడుతూ చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ అడ్డుకుని వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. డి లీమిటేషన్ ప్రక్రియను అడ్డుకుని దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలిగించిందన్నారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు, దక్షిణాది రాష్ట్రాలకు కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందని ఆయన ఆరోపించారు. ప్రపంచ దేశాలంతా ప్రధాని నరేంద్రమోడి పాలనకు కితాబు ఇస్తుంటే మన దేశంలోని ప్రతిపక్షాలు మాత్రం దేశాభివృద్ధికి అడ్డుపడుతున్నాయని ఆయన విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు తమ స్వప్రయోజనాల కోసం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా దేశ ప్రజలంతా ప్రధాని నరేంద్ర మోడి వెంటే ఉన్నారని అన్నారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలు నరేంద్రమోడికి, బిజెపికి ప్రజల్లో ఉన్న ఆదరణను మరోసారి ఋజువు చేశాయని అన్నారు. ఈ నెల 10న జరిగే బహిరంగ సభకు ప్రతి ఒక్కరు తరలివచ్చి విజయవంతం చేయాలని హరిగౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో మడిగెల లక్ష్మారెడ్డి, సురేఖ, గజానంద్, ప్రదీప్ చందు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణాలో రాబోయేది బిజెపి ప్రభుత్వమే : వనిపల్లి



**వనస్థలిపురం. మే. 4. ప్రభాతవార్త.**

వనస్థలిపురంలోని బిజెపి కార్యాలయంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ మూడు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన సందర్భంగా ఘనంగా సంబరాలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి గారి అధ్యక్షతన బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని కార్యకర్తలు ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజలు అభివృద్ధి, పారదర్శకత మరియు మంచి పాలనకు మద్దతు తెలుపుతూ భారతీయ జనతా పార్టీకి మరోసారి స్పష్టమైన విజయాన్ని అందించారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంపై ప్రజల నమ్మకం మరింత బలపడింది. ఈ విజయంతో పార్టీ మరింత ఉత్సాహంతో ప్రజాసేవలో ముందుకు సాగుతుంది. ప్రతి కార్యకర్త కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయి. రాబోయే రోజుల్లో కూడా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా బీజేపీ కట్టుబడి ఉంటుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, మేడ్చల్ జిల్లా రూరల్ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రీదేవి రెడ్డి, గాజుల స్వయం ప్రకాష్, రాష్ట్ర చేనేత సెల్ కో కన్వీనర్ బొమ్మ రఘురాం నేత, జిల్లా ప్రధాన కార్యదర్శులు బోల్గాం యశ్వాల్ గౌడ్, బండారి భాస్కర్, మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, యువమోర్చా, మహిళా మోర్చా, ఓబీసీ మోర్చా, ఎస్సీ ఎస్టీ మోర్చా నాయకులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కమధురా నగర్‌లో ఓపెన్ నాలా,పార్క్ కాంపౌండ్ వాల్ నిర్మాణం తక్షణం చేపట్టాలి





**నేరెడ్ మెట్, మే 4,ప్రభాతవార్త :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నేరేడ్‌మెట్ ఎక్స్ రోడ్స్ సమీపంలోని మధురా నగర్ కాలనీలో ఓపెన్ నాలా సమస్య తీవ్రంగా ఉందని వెంటనే ఈ సమస్య పరిష్కరించాలని మధురా నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కాలనీలో ఉన్న ఓపెన్ నాలా కారణంగా డ్రైనేజీ నీరు ఇళ్లలోకి చేరుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసోసియేషన్ పేర్కొంది. ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత విషమంగా మారి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. దోమల పెరుగుదలతో వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున, ఓపెన్ నాలాపై బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, మధురా నగర్ మున్సిపల్ పార్క్‌కు సంబంధించిన కాంపౌండ్ వాల్ నిర్మాణం చాలా కాలంగా పెండింగ్‌లో ఉండటంతో పార్క్ భద్రత దెబ్బతింటోందని పేర్కొన్నారు. చిన్నారులు, వృద్ధులు వినియోగించే ఈ పార్క్‌లో భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ సమస్యలపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు వినతులు అందజేసినా పరిష్కారం కానందున, తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో అసోసియేషన్ ప్రతినిధులు డి. శ్రీనివాస్ రెడ్డి (అధ్యక్షుడు), కె. సూర్య నారాయణ (ప్రధాన కార్యదర్శి), వై. రవీంద్ర (ఉపాధ్యక్షుడు), కె. శ్రీనివాస్ (సలహాదారు)లు పాల్గొన్నారు.

## మోడీ సభ విజయవంతం చేయాలి : ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



మోడీ సభపై పార్టీ నేతలతో సమీక్ష నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, మే 4 ప్రభాతవార్త :** నగరంలో ప్రధాని మోడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బిజెపి సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కోరారు. ఈ మేరకు సోమవారం రామంతాపూర్ వెంకటొరెడ్డినగర్, రాంరెడ్డినగర్‌లలో ప్రధానీ మోడీ సభ విజయవంతం చేయాలని కోరుతూ పార్టీ నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ మూడో విడత పాలనలో తెలంగాణలో జరిగే మొదటి బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరారు. ప్రధాని మోడీ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని, పేదలందరూ ఆయన వైపు చూస్తున్నారన్నారు. తెలంగాణలో 2028 అసెంబ్లీ ఎన్నికలకు శంఖారావం పూరిస్తుందని, తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మాజీ కౌన్సిలర్ చింతోజు శ్రీనివాస్ చారి, మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి, జిల్లా పరిశీలకులు నటరాజ్ గౌడ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్ గుప్తా, వల్లపు జగన్ యాదవ్, గడ్డం సాయికిరణ్, చెల్లోజు ఎల్లాచారి, సంజయ్ పటేల్, తడకపల్లి ప్రవీణ్, దారం వెంకటేష్ గుప్తా, అశోక్ రాజా, పెంటపల్లి వెంకన్న, ఇల్లిటం నరసింహా రెడ్డి, జి హరిబాబు, ఆవుల సుధాకర్, పుచ్చుల అశోక్, ముసగంపల్లి శివ, సిహెచ్ బాలమణి, రాగి లతా రెడ్డి, గడ్డం భవాని, శీలం సుధా ,పలుగుల అంజయ్య పటేల్, కోటమర్తి వెంకటేష్, పీసరి శంకర్, పారుపల్లి హనుమంతారావు, బద్రీనాదజ్, తునుకోజు ప్రభాకర్ చారి, లింగం చారి, కల్మకల్ల లింగం ,మల్లయ్య, జెట్ట సాయి దీరజ్, గడ్డం వెంకట్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీనగర్‌లో ఘనంగా హిందూ సమ్మేళనం



హిందూ సమ్మేళనానికి హాజరైన శంకరానంద స్వామీజీ తదితరులు: చిత్రంలో ఒంటేరు నర్సింహారెడ్డి, మద్ది రాజశేఖర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, మే 4 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని జిల్లెలగూడ డివిజన్ గాయత్రీనగర్‌లో హిందూ సమ్మేళన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దేశ సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ అభినబ శంకరానంద స్వామీజీతో పాటు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, సక్కుబాయి తదితర ముఖ్యులు ప్రధాన వక్తలుగా ఉపన్యాసం చేశారు. సమ్మేళనం సందర్భంగా చిన్నారుల దేశభక్తి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వందేమాతర గీతంతో సమ్మేళనాన్ని ఘనంగా ముగించారు. ఈ కార్యక్రమంలో డి.వెంకటేశ్వర రావు, వంటేరు నర్సింహారెడ్డి, రాఘవేందర్, జ్ఞానేశ్వర్, రాములు, మల్లారెడ్డి, మద్ది రాజశేఖర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## జల్‌పల్లిలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపనోత్సవాలు



జల్‌పల్లి బొడ్రాయి ప్రతిష్టాపనోత్సవాలకు హాజరైన సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మే 4 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ మండలం జల్‌పల్లి సర్కిల్ పరిధిలోనున్న జల్‌పల్లి డివిజన్ కిందకు వచ్చే జల్‌పల్లి పాత గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి హాజరై ప్రతిష్టించిన బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామన్ని కాపాడే బొడ్రాయి దేవత ఆశీస్సులతో గ్రామస్తులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ ముఖ్యులు, స్థానిక గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు, పేదలకు ఉచిత వైద్య పరీక్షలు



బిజెపి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన దృశ్యం

**సరూర్‌నగర్, మే 4 ప్రభాతవార్త:** జిల్లెలగూడ డివిజన్‌లోని అంబేద్కర్‌నగర్ కాలనీలో బిజెపి నాయకుడు వంటేరు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు, పేదలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చవాన్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో వారికి బిపి, షుగర్, కొలస్ట్రాల్, దంత పరీక్షలు నిర్వహించి ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమానికి హాజరైన వారికి వేసవి నేపథ్యంలో మల్లారెడ్డి అల్పాహారంగా రాగి అంబలి పంపిణీ చేశారు. మహేశ్వరం బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు గాజుల మధు, కొంద్రు గౌరీ శంకర్, ఆంజనేయులు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 6న పోచమ్మ దేవాలయంలో నాగదేవత విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దేవాలయం కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట,మే 4, ప్రభాతవార్త:** మలక్ పేట శ్రీ పోచమ్మ దేవాలయంలో ఈనెల 6వ తేదీన నాగదేవత విగ్రహ పునః ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు దేవాలయం కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ లు తెలిపారు. దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులతో కలిసి వారు పునః ప్రతిష్టాపనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలను పురస్కరించుకుని దేవాలయంలో ఈనెల 5వ తేదీ ఉదయం ప్రతిష్టాపన కార్యక్రమం ప్రారంభం, మండపారాధన, దేవతా స్థాపన, పుణ్య వాహచనం, పంచగవ్యప్రాసనము, మాతృక ఆరాధన, అగ్ని ప్రతిష్ట, ఆవాహిత దేవత హోమము, సర్వసూక్త హోమము, దుర్గా హోమము, మహా స్నాపనము, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ, సాయంత్రం గ్రామ ఉత్సవం, దాన్యాధివాసము, ఫల పుష్ప ఆదివాసము, శయన ఆదివాసము, తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని వివరించారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కటకం శ్రీనివాస్, శివకుమార్, మేదర సునీత, తులసి సురేష్ కుమార్, చౌకి తులసి, కమల పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి బిఆర్ఎస్ నేత చేయూత



నిరుపేద కుటుంబానికి చేయూత అందిస్తున్న బిఆర్ఎస్ సీనియర్ నేత పూడూరి జితేందర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 4 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్‌లోని నిరుపేద కుటుంబానికి బిఆర్ఎస్ సీనియర్ నేత పూడూరి జితేందర్‌రెడ్డి చేయూత అందించారు. ఆడబిడ్డ పెండ్లికి ఉప్పల్ పీజేఆర్ అండగా నిలిచారు. బీఆర్ఎస్ మహిళా కార్యకర్త కుమార్తె వివాహానికి ఇబ్బంది ఉండడంతో ఉప్పల్ బీఆర్ఎస్ నాయకుడు పూడూరి జితేందర్‌రెడ్డి తన వంతు సహకారం అందించారు. మహిళా కార్యకర్తను తోబుట్టువుగా భావించి రూ.15వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదల కోసం పాటుపడే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్‌కు మరమ్మతులు చేయండి : ఎండి. రఫీక్



జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న రామంతాపూర్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.డి.రఫీక్ తదితరులు

**రామంతాపూర్, మే 4 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ పరిధిలోని చిన్న చెరువు వద్ద ఉన్న ఓపెన్ జిమ్‌కు మరమ్మతులు చేయించాలని రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీక్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎం.డి.రఫీక్ మాట్లాడుతూ రామంతపూర్ చిన్న చెరువులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై పరికరాలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ఓపెన్ జిమ్ పాడై పోవడం వల్ల మార్నింగ్ వాకర్స్, యువత, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విరిగిన పరికరాల వల్ల ప్రమాదాల ముప్పు పెరిగిందని, ప్రజల ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం పడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మొగలి లింగం, ఆదినారాయణ గౌడ్, లగుసాని శ్రీనివాస్ గౌడ్, నరసింహ, గట్టయ్య, ఎండి.షకీల్, చోటు బాయ్, సూరి ఐకాన్, సాయి పాల్గొన్నారు.

**ఉప్పల్ జోన్‌లో ప్రజావాణి ఫిర్యాదుల స్వీకరణ**

**ఉప్పల్, మే 4 ప్రభాతవార్త :** ఉప్పల్ జోన్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పౌరుల నుండి వివిధ ప్రజా సంబంధ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి టౌన్ ప్లానింగ్ నుంచి 3, ఇంజనీరింగ్ నుంచి 4 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలను నమోదు చేసి, సంబంధిత శాఖాధికారులకు తక్షణ చర్యల కోసం పంపించినట్లు జోనల్ కమిషనర్ అధికారులు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నిస్తూ నిర్దిష్ట గడువులో చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు.



సాహెబ్ నగర్ లో గల శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి జాతర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ కుటుంబ సమేతంగా స్వామివారి జాతర లో పాల్గొని అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిత్రంలో ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల శ్రీనివాస గౌడ్ తదితరులు పాల్గొన్నారు.(ప్రభాతవార్త. వనస్థలిపురం.).



పశ్చి మ బెంగాల్,అస్సాం,పుదుచ్చేరి రాష్ట్రాల్లో బిజెపి ఘన విజయం సాధించడం పట్ల బిజెపి సీనియర్ నాయకుడు, బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ బి.జె.పి.ప్రధాన కార్యదర్శి గంగం ప్రేమనాథ్ సాహెబ్ నగర్ డివిజన్‌లో రహదారిపై వెళ్లే ఆటో డ్రైవర్ లకు,నాయకులకు,కార్యకర్తలకు మిఠాయిలు పంచి పెట్టి సంబరాలు జరుపుకున్నారు.(ప్రభాతవార్త. వనస్థలిపురం.)

**రూ.కోటి 12లక్షలతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**



బీరప్పగడ్డలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, మే 4 ప్రభాతవార్త :**

ఉప్పల్ సర్కిల్ పరిధిలోని బీరప్పగడ్డ డివిజన్‌లో రూ.కోటి 12లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్‌లో రూ.కోటి 12లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామని, భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే సిసి రోడ్డు పనులు చేపడుతామని తెలిపారు. దశలవారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. మల్లాపూర్‌లో వంద పడకల ఆసుపత్రి నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజల కోసం పాటుపడే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని పరిష్కరిస్తున్నామని తెలిపారు. మల్లికార్జున్ నగర్ శివరేజీ అవుట్‌లెట్ పనులను కూడా వీలైనంత తొందరలో సాంక్షన్ చేయించి పూర్తి చేస్తామని తెలిపారు. హైకోర్టు కాలనీ హెచ్ఎంటి చెరువు వరకు అభివృద్ధి పనులకు రూ.30 కోట్ల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు, కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**తెలంగాణలో వచ్చేది బిజెపి ప్రభుత్వమే: శంకర్‌రెడ్డి**



బాలాపూర్ చౌరస్తాలో కార్యకర్తలకు మిఠాయిలు తినిపిస్తున్న శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మే 4 ప్రభాతవార్త:** తెలంగాణలో వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని ఆ పార్టీ కో-ఆపరేటివ్ సెల్ రాష్ట్ర కన్వీనర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా ఘన విజయం సాధించి అధికారంలోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ చౌరస్తాలో బిజెపి ఆధ్వర్యంలో టపాసులు కాల్చి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన శంకర్‌రెడ్డి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మిఠాయిలు తినిపించి వేడుకలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారనీ బిజెపిని అధికారంలోకి తేవడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. దక్షిణ భారత దేశంలో బిజెపి క్రమంగా బలపడుతున్నదని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరిగితే బిజెపికే పట్టం కడుతారని శంకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, నాయకులు ధరంకార్ కిశోర్, శశిధర్, భూషణం, దాసు, విజయ్‌కుమార్, అరుణ జీ, సూర్యప్రకాశ్‌సింగ్, జయకాంత, రాఘవేంద్ర, రాజేష్‌రెడ్డి, భాస్కర్, భూమన తదితరులు పాల్గొన్నారు.

**ప్రభు సార్ సేవలు చిరస్మరణీయం: బీరప్ప, శ్రీనివాస్‌రెడ్డి**



ప్రభు సార్‌కు నివాళులర్పిస్తున్న లార్డ్స్ చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి

**సరూర్‌నగర్, మే 4 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి కృషి చేసిన లార్డ్స్ వ్యవస్థాపకుడు బిబి ప్రభు సార్ లేని లోటు ఎన్నటికీ తీర్చలేనిదని లార్డ్స్ గ్రూపు పాఠశాలల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. ప్రభు సార్ 17వ వర్ధంతి సందర్భంగా బడంగ్‌పేట్ శివనారాయణపురం పాఠశాలలో సంస్మరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభు ఆశయ సాధన కోసం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ అడ్మిన్ ఇంఛార్జి మణిశరణ్, డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిడి సంతోష్, భానూరు శ్రీనివాస్‌రెడ్డి, ఇంఛార్జి రేఖ, ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.



సాహెబ్ నగర్ లోని శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి ఆలయ జాతర సందర్భంగా ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్వామివారి జాతరలో పాల్గొని త్రినేత్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిత్రంలో కటికరెడ్డి అరవింద్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల శ్రీనివాస్ గౌడ్,బి.ఆర్.ఎస్.నాయకులు గౌరిశెట్టి మనోజ్ కుమార్ తదితరులు ఉన్నారు.(ప్రభాతవార్త, వనస్థలిపురం.).



ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధి లోని సిఫిన్ కాలనీ పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలను కాలనీవాసులతో కలిసి మాజీ కార్పొరేటర్ పై ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఫిల్ కాలనీ అసోసియేషన్ సభ్యులు ఓమ్ రాజ్,అరుణ్,పెద్ది రాజు,చంద్ర కళ,భాను ప్రకాష్,చంద్ర కాంత్,శర్మ,సోమయ్య,శ్రీమన్నారాయణ,ఆనంద్, వెంకట్ రామన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబు సత్యనారాయణ సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు





ఇటీవల డీజీపీగా పదవి బాధ్యతలు చేపట్టిన సివి ఆనందును మల్కాజ్గిరి మాజీ శాసనసభ్యులు ఆకుల రాజేందర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు .